పారిపోయి వచ్చిన బాలుడి చేరదీత

అడ్డగుట్ట: ఇంట్లో నుంచి పారిపోయి వచ్చి రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్న ఓ బాలుడిని ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీసి హోమ్‌కు తరలించారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ నెం–02లో బుధవారం ఉదయం అజిత్‌కుమార్ (12) అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. గమనించిన ఆర్పీఎఫ్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి సదరు బాలుడి వద్దకు వెళ్లి విచారించగా ఇంట్లో నుంచి పారిపోయి వచ్చినట్లు చెప్పాడు. దీంతో చైల్డ్ లైన్ సహకారంతో ఆర్పీఎఫ్ పోలీసులు ఆశ్రిత హోమ్‌కు తరలించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బౌద్ధనగర్: అర్బన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కమిటీ న్యూ అశోక్‌నగర్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ అధ్యక్షుడు మల్లేష్ తెలిపారు. బుధవారం బౌద్ధనగర్ డివిజన్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ఐదుగురు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆలూరి అశోక్, వైస్ ప్రెసిడెంట్‌గా దప్పు మల్లికార్జున్, జాయింట్ సెక్రటరీగా చెన్న శ్రీనివాస్, ఆర్గనైజర్‌గా పెండూరి రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. తమపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తూ, బస్తీవాసులకు తమవంతు సహకారాన్ని అందిస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిటీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌గౌడ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ హేమలతకు మాతృవియోగం

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ హేమలత తల్లి అనసూయ బుధవారం కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అనసూయ భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, రమణ, జ్ఞానీ, అబ్బాస్ నివాళులర్పించారు.

అసాంఘిక శక్తులను కట్టడి చేయాలి

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి అశేషంగా తరలివచ్చే భక్తులకు అసాంఘిక శక్తుల పట్ల ఇబ్బందులు తలెత్తకుండా వారిపై దృష్టి సారించాలని రాయల సేవా సమితి ప్రతినిధులు పోలీసులను కోరారు. ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ మాట్లాడుతూ.. భక్తుల చాటున అసాంఘిక శక్తులు యథేచ్ఛగా సంచరిస్తుంటారని మద్యం, డ్రగ్స్ మత్తులో గతేడాది సృష్టించిన బీభత్సంతో భక్తులతో పాటు చుట్టు పక్కల కాలనీ వాసులలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. మత్తులో జోగుతున్న యువకులను కట్టడి చేసేందుకు దేవాలయ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రత్యేకంగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరగా పోలీసు అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. వినతి ఇచ్చిన వారిలో సభ్యులు అప్పాజి, ఆంజనేయులు, మధు, కిషోర్ ఉన్నారు.

కట్టమైసమ్మ బోనాలకు ఏర్పాట్లు షురూ

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతర నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేపట్టామని ఆలయ ఈఓలు మహేందర్‌గౌడ్, అంబుజ, ధర్మకర్తల మండలి చైర్మన్ గుంటి కృష్ణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించారు. పూల అలంకరణకు మూడు టెండర్లు దాఖలు కాగా తక్కువ ధర రూ. 2.46 లక్షలకు కోట్ చేసిన దయానంద్, విద్యుత్ దీపాల అలంకరణకు ఆరు టెండర్లు దాఖలు కాగా తక్కువ ధర రూ. 3,03,415 కోట్ చేసిన రాజేష్‌కు నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. తన సొంత నిధులతో ఆలయానికి రంగులు వేయించనున్న ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 28,29 తేదీలలో చిలకలగూడ బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ప్రధాన అర్చకుడు తిరుమలాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం నేడు (4న) తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ కోరారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని, రూ.7100 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల, వీసీల నియామకం, ప్రభుత్వ కాలేజీ, పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో బంద్‌కు పిలుపునిచ్చినట్లు వివరించారు.

సీపీఎం మద్దతు..

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ పరీక్ష అక్రమాల పై విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యచరణ ఆధ్వర్యంలో నేడు నిర్వహించతలపెట్టిన (4న) విద్య సంస్థల బంద్‌కు సీపీఎం మద్దతు ప్రకటించినట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి పేర్కొన్నారు.

ఆ కాలేజీల గుర్తింపును రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు, డొనేషన్లను వసూలు చేసేందుకు సిండికేటుగా ఏర్పడిన ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌పీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వలిగొండ నరసింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఉన్నత విద్య మండలి సెక్రెటరీ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల నిర్వాహకుల ధనదాహానికి ప్రతిభగల పేద విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను చదవలేని దుస్థితి ఏర్పడిందన్నారు. అడ్మిషన్ల ప్రక్రియకు ముందే అడ్డదారిలో సీట్లు విక్రయిస్తున్న కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో టీఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల బాలు, రాష్ట్ర కార్యదర్శి మామిడాల రవికుమార్ ఉన్నారు.

ఓయూకు గ్రూప్-4 ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇటీవల గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఓయూకు రానున్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది వర్సిటీలో సేవలకు 375 మంది గ్రూప్–4 ఉద్యోగులను టీఎస్‌పీఎస్సీ ద్వారా ప్రభుత్వం ఓయూకు ఎంపిక చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఓయూకు ఉద్యోగాలను ఎంపిక చేయడం 107 ఏళ్ల యూనివర్సిటీ చరిత్రలో ఇదే ప్రథమం. గతంలో వైస్ చాన్సలర్ నాన్ టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేసేవారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిబంధనలు మార్చి టీఎస్‌పీఎస్సీ ద్వారా ఓయూకు ఉద్యోగాలను నియమించారు. ఇదిలా ఉండగా ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయనే ఆశతో గత 27 సంవత్సరాల నుంచి తక్కువ వేతనానికి పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల పర్మనెంట్ లక్ష్యం నెరవేరదు. కనీసం టైం స్కేల్ ఉద్యోగులను కూడా పర్మనెంట్ చేసే అవకాశాలు కనిపించడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపును అందుకొని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పోరాడిన ఓయూ కాంట్రాక్టు ఉద్యోగులకు నేడు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంతోపాటు కాంగ్రెస్ పార్టీ కూడా మోసం చేస్తున్న తరుణంలో ఉద్యోగాల పర్మనెంట్ కోసం గతంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేసిన కాంట్రాక్టు సిబ్బంది మరో పోరాటానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

సమీక్షల్లేవ్.. సమావేశాల్లేవ్!

- ముందుకు సాగని పెండింగ్ పనులు
- కొత్త వాటి ఊసేలేదు
- ఇళ్లకే పరిమితమైన కార్పొరేటర్లు
- పోరాటానికి సిద్ధమవ్వాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే పిలుపు

ఏడు నెలలుగా కుంటుపడిన అభివృద్ధి


బేగంపేటలో నిలిచిపోయిన ముస్లిం గ్రేవ్‌యార్డు నిర్మాణం

సనత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 7 నెలలు కావస్తోన్నా సనత్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్లో ఇంకా కదలిక లేదు. మరోవైపు అభివృద్ధి పనులపై సమీక్షలు పెట్టేవారు లేరు. ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు ఏ స్థాయిలో ఉన్నాయో కూడా అధికారులకు అంచనా లేదు. ఫలితంగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారింది. గత బీఆర్ఎస్ హయాంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు సనత్‌నగర్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ఇందులో జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలకు చెందిన పనులే అత్యధికం. అయితే శంకుస్థాపనల తంతు వరకు వచ్చినా పనుల్లో చాలా వరకు పురోగతి శూన్యం. అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో ఓ సారి, పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో మరోసారి సుమారు మూడు నెలల పాటు అధికారులు అసలు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టలేదనే చెప్పాలి. కోడ్ ముగిసిన తర్వాత అయినా పనులు ముందుకు సాగుతాయనుకుంటే అదీ లేకుండా పోయింది. ఇక ఇప్పుడు బోనాల ఉత్సవాల సమీక్షల పేరుతో అభివృద్ధి పనులపై సమీక్ష అటకెక్కింది. ఈఎస్‌ఐ గ్రేవ్‌యార్డు గత ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేయగా ఇంత వరకు ఆ నిధులు జాడే లేదు. బేగంపేటలో ముస్లిం గ్రేవ్ యార్డు నిర్మాణ పరిస్థితి కూడా అంతే. ఎన్నికల ముందు చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఎలాంటి కదలిక లేకపోవడంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు.

కనిపించని కార్పొరేటర్లు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సనత్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు, బీజేపీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు దాదాపు ఇళ్లకే పరిమితమయ్యారు. అడపాదడపా వర్షాలు పడినప్పుడు ముంపు ప్రాంతాల సందర్శనకే పరిమితమవుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల గురించి వారు సైతం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం మనది కాదు కదా? ఎక్కడ అభివృద్ధి పనులు జరిగితే మనకెందుకు మనకు కావలసిందల్లా అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ నుంచి కమీషన్ వస్తే చాలు అన్న స్థితిలో కార్పొరేటర్లు ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులను పరిశీలించడం గానీ, గతంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షలు జరపడం గానీ చేసిన దాఖలాలు మాత్రం కనిపించడం లేదు.

కొత్త పనుల ప్రతిపాదన ఊసే లేదు..

క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవాల్సిన కార్పొరేటర్లు కూడా అంతగా పట్టించుకోవడం లేదు. చిన్నాచితకా సమస్యలు ఉంటే అధికారులు చెప్పి ఊరుకుంటున్నారే తప్ప ఆ సమస్య పరిష్కారం ఎంత వరకు వచ్చిందో కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అసలు కార్పొరేటర్ల మాటలను అధికారులు లెక్క చేయడం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. అలాంటప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం ఎలా జరుగుతుందో అర్థం కావట్లేదు. పాత పనులకే మోక్షం కలగడం లేదు, ఇక కొత్త వాటి గురించి తెలుసుకోవడం, ప్రతిపాదనలు రూపొందించడం వంటి ఊసే కనిపించడం లేదు.

ఎమ్మెల్యే సైతం అసహనం..!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని ఇటీవల సనత్‌నగర్ పర్యటనలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బాహాటంగానే విమర్శలు చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఒక అడుగు ముందుకువేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే కార్యక్రమాలు చేపడతామంటూ హెచ్చరించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను నూతన ప్రభుత్వం రద్దు చేసిందని, ఇది చాలా దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఒక ఎమ్మెల్యేనే బాహాటంగా ఇక్కడి అభివృద్ధి పనుల నిర్వహణపై విమర్శలు చేస్తుండగా అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకు చీమ కుట్టినట్లయినా లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యుడు ఏదైనా సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఎంత వరకు పరిష్కారం జరుగుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

బ్రాహ్మణవాడిలో మర్రి శశిధర్‌రెడ్డి పర్యటన



సనత్‌నగర్: బేగంపేట డివిజన్ బ్రాహ్మణవాడిలో బుధవారం ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి పర్యటించారు. జలమండలి అధికారులు డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణ సమయంలో గోతులు తవ్వి వ్యర్థాలను తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మర్రి శశిధర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన అక్కడి నుంచే జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫోన్ చేయగా వారు అక్కడికి చేరుకున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తామని జలమండలి సిబ్బంది తెలిపారు. రెండు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జలమండలి జీఎం వినోద్, ప్రకాష్‌నగర్ సెక్షన్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డీఈ సంతోష్, నాయకులు మర్రి పురురవరెడ్డి, నెమలి ఆనంద్, మహేష్, అంజిబాబు, యాదగిరి, శ్రీనివాస్, రాంచందర్, మంగమ్మ, సత్తెమ్మ, సురేందర్‌రెడ్డి, గుంటి సత్యనారాయణ, విజయ్‌కుమార్, వికాస్, నరేష్, కిట్టు, పార్శి పరమేష్ పాల్గొన్నారు. కాగా.. వరద సాఫీగా పారేందుకు కూకట్‌పల్లి నాలా రిటైనింగ్ గోడకు మర్రి శశిధర్‌రెడ్డి సూచన మేరకు మున్సిపల్ అధికారులు వన్‌వే ఓపెన్ వాల్వ్‌ను అమర్చారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

రసూల్‌పురా: విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు సూచించారు. టివోలి రోడ్‌లోని బోల్టన్ పాఠశాల్లో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాలలకు ఆటోలలో వెళ్లే విద్యార్థులు ఐదుగురి కన్నా ఎక్కువగా ఎక్కరాదని ఆటో డ్రైవర్లు తాగి ఉంటే అలాంటి ఆటోలో వెళ్లరాదని స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు ఆటోలపై నిఘా ఉంచాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు బాధ్యతలవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుభాషిణి రావు, వైస్ ప్రిన్సిపాల్ గాయత్రీ దేవి, చంద్రశేఖర్, క్యాంపస్ ఇన్‌చార్జి వరప్రసాద్ అనితేష్ పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

సనత్‌నగర్: రంగారెడ్డి జిల్లా ఉపాధి కార్యాలయం ఎన్‌సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీసెస్), డాన్‌బాస్కో దిశ సంయుక్తంగా ఈ నెల 5న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దిశా డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కోఆర్డినేటర్లు ఐవన్ వాజ్, కార్తీక్, రంగారెడ్డి జిల్లా ఎన్‌సీఎస్ యువ అధికారి విజయ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగుతుందన్నారు. హెటిరో, టెక్ మహీంద్రా, అపోలో హోమ్ హెల్త్ కేర్, ఎంజీబీ మోటార్ అండ్ ఆటో ఏజెన్సీ, రిలయన్స్ డిజిటల్ వంటి దాదాపు 17 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని మరిన్ని వివరాలకు 94940 92219, 89771 75394 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా భారత క్రైస్తవ దినోత్సవం


క్రిష్టియన్ డే ఉత్సవాల్లో పాల్గొన్న క్రైస్తవ ప్రముఖులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలోని క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎస్పీజీ తమిళ్ చర్చిలో బుధవారం భారత క్రైస్తవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ క్రైస్తవ సంఘాలకు చెందిన ప్రముఖులు క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కన్వీనర్ డాక్టర్ శ్యామ్యూల్ ఎడ్వర్డ్ మద్దెల, సీనియర్ నాయకులు గొల్లపల్లి దయానంద్, గ్లోబల్ గ్లోరియస్ ఫౌండర్ డాక్టర్ గ్లోరీ ఆనంద, మట్టా థామస్ ఎడిసన్ హాజరై మాట్లాడారు. క్రీస్తు శకం 52వ సంవత్సరంలో యేసు క్రీస్తు శిష్యుల్లో ఒకరైన తోమా భారతదేశానికి వచ్చి యేసు క్రీస్తు సువార్త, సేవా పరిచర్యను ప్రారంభించారని చెప్పారు. 72వ సంవత్సరంలో ఆయన యేసు క్రీస్తు కోసం హత సాక్షిగా మరణించారని అయన మరణదినమైన జూలై 3వ తేదీని భారత క్రైస్తవ దినంగా ఆచరిస్తూ వస్తున్నట్లు తెలిపారు. క్రీస్తు సువార్తను భారతదేశానికి తీసుకుని వచ్చిన శుభ దినం సందర్భంగా దీన్ని ఆచరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్, నాగళ్ల పోచయ్య, ఇశ్రాయేలు, బిషప్ ముల్కల భాస్కర్, మత్తయ్య, సువర్ణరాజ్, కర్ణాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ సున్నంబట్టీ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సికింద్రాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నిఖిల్ గుప్తా మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ ద్వారా ప్రభుత్వ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ తదితర వస్తువులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వినీత్ గుప్తా, కోశాధికారి సందీప్, ఉపాధ్యాయులు పుష్పలత, ప్రభాకర్ పాల్గొన్నారు.

హమాల్‌బస్తీలో..


హమాల్‌బస్తీలో పుస్తకాలు అందజేస్తున్న కల్పన

పద్మారావునగర్ హమాల్‌బస్తీలోని గృహ కార్మికుల పిల్లలకు పుస్తకాలు ఇతరత్రా విద్యా సామగ్రిని అందజేశారు. బియాస్ డోనర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు కల్పన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి కష్టపడి చదువుకోవాలని కోరారు. ఇంగ్లిష్ భాషలో మంచి నైపుణ్యం సాధించాలని కోరారు.

మెరుగైన వైద్యానికి 'కిమ్స్ సన్‌షైన్' కృషి



మాట్లాడుతున్న వైద్యులు కుషాల్, గురువారెడ్డి

సనత్‌నగర్: యువతలో కార్టిలేజ్ గాయాల కారణంగా తీవ్రమైన నొప్పితో బాధపడుతున్న వారికి ఎపీసీలర్ జాయింట్ రీసర్ఫేసింగ్ శస్త్ర చికిత్స ద్వారా మోకాలు మార్పిడి చేయకుండానే దెబ్బతిన్న భాగాన్ని తిరిగి అమర్చే ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. మొట్టమొదటిసారిగా ఈ టెక్నాలజీ ఆధారంగా బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో 40 ఏళ్ల వ్యక్తికి శస్త్ర చికిత్స చేశారు. సర్టిఫైడ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్, ఆర్థోపెడిక్, ఆర్థోస్కోపి సర్జన్ డాక్టర్ కుషాల్ హిపాల్ గోవాంకర్, స్టాక్‌హోమ్‌లోని కెరోలిన్ స్కా ఇనిస్టిట్యూట్ మాజీ ప్రొఫెసర్, ఏపీ సర్ఫ్ మెడికల్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ లైఫ్ రీడ్‌తో కలిసి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన అనంతరం వివరాలు వెల్లడించారు. యువతలో పెరుగుతున్న మోకాలు గాయాలకు ఆధునికంగా అందుబాటులోకి వచ్చిన ఎపీసీలర్ జాయింట్ రీసర్ఫేసింగ్ శస్త్ర చికిత్స ద్వారా యుక్త వయస్సులోనే మోకాలు మార్పిడి వరకు వెళ్లకుండా చూడవచ్చన్నారు. ఈ పద్ధతి ద్వారా విదేశాల్లో వందలాది మంది రోగులకు ప్రయోజనం చేకూరిందని, ఇప్పుడు భారతదేశంలో తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్‌లో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక టెక్నాలజీని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ రోగులకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో హాస్పిటల్ సీఓఓ సుధాకర్‌జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు గాంధీనగర్ డబుల్ బెడ్రూమ్ గృహ సముదాయం కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతున్న దక్షిణ కాళీమాత టెంపుల్ ఆలయ కలశ ప్రతిష్టాపన పూజ కార్యక్రమం బుధవారం జరిగింది. బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. డబుల్ బెడ్రూమ్ కమిటీ సమష్టిగా ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో కాళీమాత అమ్మవారి ఆలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షురాలు సంధ్య, ఉపాధ్యక్షుడు శేఖర్, కమిటీ సభ్యులు సుదర్శన్, శ్రీను, నవీన్, పవన్, రామస్వామి, ప్రవీణ్ బస్తీ నాయకులు స్వరూప, సబిత, కిషోర్, పరశురాం పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగలను పట్టుకున్న నాగమ్మ శక్తిటీమ్

అడ్డగుట్ట: రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సెల్‌ఫోన్లు అపహరిస్తున్న ఇద్దరు దొంగలను ఆర్పీఎఫ్ నాగమ్మ శక్తిటీమ్ పట్టుకుని జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గత నెల 29న అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను ఆర్పీఎఫ్ నాగమ్మ శక్తీ టీమ్ పట్టుకుని వారిని తనిఖీ చేయగా సుమారు రెండు ఫోన్‌లు లభ్యమయ్యాయి. సరైన వివరాలు చెప్పకపోవడంతో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న శక్తిటీమ్ మహిళ కానిస్టేబుళ్లు శ్రీలేఖ, డాలీ, మిన్జ్ పోలీసులకు అప్పగించారు.

కార్పొరేటర్ తనయుడు, అనుచరుడిపై జీహెచ్‌ఎంసీ ఉద్యోగి ఫిర్యాదు

బౌద్ధనగర్: విధుల్లో ఉన్న తనను అసభ్యపదజాలంతో దూషించి, బెదిరింపులకు పాల్పడిన అడిక్‌మెట్ కార్పొరేటర్ సునిత కుమారుడు తరుణ్‌గౌడ్, ఆమె అనుచరుడిపై చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ చైన్‌మెన్ ఫిర్యాదు చేసిన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. జీహెచ్‌ఎంసీ సర్కిల్(15) ఏసీపీ ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం చైన్‌మెన్ జగన్, న్యాక్ సైట్ ఇంజినీర్ అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్‌గుండు సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం పరిశీలించేందుకు వెళ్లారు. భవనం కొలతలు తీసుకుంటుండంగా ఇదే విషయాన్ని భవన యజమాని కార్పొరేటర్ సునిత అనుచరుడైన శివ అనే వ్యక్తికి ఫోన్ చేయగా అతను జీహెచ్‌ఎంసీ ఉద్యోగిపై అగౌరవంగా మాట్లాడారు. తమ అనుమతి లేకుండా అక్కడికి ఎందుకు వెళ్లావంటూ దుర్భాషలాడుతూ బెదిందిరింపులకు పాల్పడ్డారు. ఆ తర్వాత కార్పొరేటర్ కుమారుడు తరుణ్‌గౌడ్ ఫోన్ చేసి జగన్‌ను తిట్టడంతో పాటు ఆయన విధులకు ఆటంకం కలిగించారంటూ ఫిర్యాదు చేశారు.

దక్కన్ మానవ సేవా సమితి సేవలు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


దక్కన్ మానవ సేవా సమితి సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: సికింద్రాబాద్ బోనాల ఉత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు దక్కన్ మానవ సేవా సమితి ఆధ్వర్యంలో అందించే సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. దక్కన్ మానవ సేవా సమితి ప్రతినిధులు బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 7వ తేదీన జరిగే నూతన కమిటీ ఎన్నికల్లో భాగంగా అధ్యక్షుడిగా ఎన్నుకోనున్న గ్యాన్ మోటే ధర్మవీర్‌ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు కమిటీ సభ్యులు పరిచయం చేశారు. ధర్మవీర్‌కు ఆయన శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. దక్కన్ మానవ సేవా సమితి నిర్వహించే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లతో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం, బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగారన్నారు. తన సోదరుడిని కోల్పోయి తాను, తన కుటుంబం దుఃఖంలో ఉన్నామని, ఆ కారణంగానే బోనాల ఉత్సవాలకు దూరంగా ఉంటున్నట్లు వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కొంక రఘుమోహన్, సభ్యులు నర్సింగ్‌రావు, సిద్ధులు, కమల్‌కుమార్, ఆర్యసమాజ్ అధ్యక్షులు మాశెట్టి శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలి..

సనత్‌నగర్: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే తలసాని పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌కు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు కాలుష్యరహిత వాతావరణం, ఆరోగ్యవంతమైన జీవితం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డీన్ కల్పన, ప్రిన్సిపాల్ యాకుబ్, పాషా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

రాంగోపాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ అన్నారు. బుధవారం మెక్లోడ్ గూడలో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్రతో కలిసి ప్రారంభించారు. అలాగే వ్యాయామ శాఖ శిథిలావస్థకు చేరుకుందని స్థానికులు ఆయన దృష్టికి తేవడంతో నూతన భవన నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకుని రాగా వెంటనే సమస్య పరిష్కరించాలని జలమండలి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, జలమండలి జీఎం వినోద్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ అత్తిల్లి అరుణగౌడ్, నాయకులు కిశోర్‌కుమార్, విజయ్, మహేష్, సతీష్, కిరణ్, వెంకట్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఆకలి తీర్చడం ఎంతో పుణ్యం..

అమీర్‌పేట: ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవానికి తరలివచ్చే భక్తుల ఆకలిని తీర్చడంలో బల్కంపేట వాసులు ముందుంటారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. స్థానికులు అమీర్‌పేట మాజీ కార్పొరేటర్‌తో కలిసి కల్యాణం రోజున చేపట్టే అన్నదాన కార్యక్రమాలకు రావాలని బుధవారం ఎమ్మెల్యేకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. భక్తులు తమ ఇంటికే వస్తున్నట్లుగా భావించి వారి ఆకలి తీర్చేలా తమ శక్తి కొలది ఉచిత అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, అన్నదాన శిబిరం నిర్వాహకులు కూతురు నర్సింహ, సంతోష్ మణికుమార్, కట్ట బల్‌రామ్, వనం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవాలు

అమీర్‌పేట సోనాబాయమ్మ దేవాలయం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం జరిగిన ప్రత్యేక పూజలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి బీఆర్ఎస్ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ తరఫున భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సత్యనారాయణ, కూతురు నర్సింహ పాల్గొన్నారు.